ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.19, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 28, పచ్చి మిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 28, పచ్చకాకర 20, పందిరి బీర 23, క్యాబేజీ 11, క్యారెట్ 27, దొండ 13, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 7, పొట్లకాయ 11, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నియామకం

అడ్డగుట్ట: వినియోగదారుల హక్కుల సంస్థ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీగా శాంతినగర్‌కు చెందిన దుబ్బసి దేవానంద్ నియామిలయ్యారు. ఈ మేరకు సంస్థ గ్రేటర్ అధ్యక్షుడు మహావీర్ జైన్ చేతుల మీదుగా గురువారం నియామక పత్రాన్ని అందుకున్నారు. సంస్థలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన వారు వినియోగదారుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు, ఉపాధ్యక్షులు శివకుమార్, రాజేష్, తాండ్ర రమేష్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
09ఎస్‌ఈసీ20–నియామక పత్రాన్ని అందుకుంటున్న దేవానంద్

జోరుగా నామినేషన్ల పర్వం

- సనత్‌నగర్ నుంచి ఒక్కరోజే ఏడుగురు అభ్యర్థుల నామినేషన్.
- ఇప్పటివరకు మొత్తం 13 మంది
- 22 సెట్ల నామినేషన్లు దాఖలు


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి

సనత్‌నగర్: నామినేషన్ల ఘట్టం తుది అంకానికి చేరుకోనున్న నేపథ్యంలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. గురువారం ఒక్కరోజే ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి కుమ్మరి వెంకటేశ్వర్లు, నవరంగ్ కాంగ్రెస్ నుంచి వీజేఎస్ ప్రకాష్‌రావు పలువాయి, యుగ తులసి పార్టీ నుంచి ఉప్పలపాటి శ్రీనివాస్, మజ్లిస్ మార్క్సిజ్–ఇ–సియాసీ పార్టీ నుంచి సయ్యద్ ఖదిర్, స్వతంత్ర అభ్యర్థులుగా శ్రీనివాస్, దేవేందర్ కొన్నేలు నామినేషన్లు వేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 13 మంది 22 సెట్ల నామినేషన్లు వేశారు. మంత్రి తలసా ని శ్రీనివాస్‌యాదవ్ నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రధాన పార్టీల అభ్యర్థుల అఫిడవిట్ వివరాలు..

- **తలసాని శ్రీనివాస్‌యాదవ్ (బీఆర్‌ఎస్ అభ్యర్థి)**
బీఆర్‌ఎస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తన పేరిట ఉన్న చరాస్తుల విలువను రూ.11,71,37,250లుగా చూపించారు. అలాగే భార్య స్వర్ణ పేరిట చరాస్తి విలువను రూ. 4,54,34,968లుగా పేర్కొన్నా రు. ఇక స్థిరాస్తి విలువను రూ.16,48,40,922 కోట్లుగా, ఆయ న భార్య స్వర్ణ పేరిట రూ.54,35,176లుగా చూపించారు.
- **మర్రి శశిధర్‌రెడ్డి (బీజేపీ అభ్యర్థి)**
బీజేపీ తరుపున పోటీలో ఉన్న మర్రి శశిధర్ రెడ్డి చరాస్తుల విలువను రూ.19,15,84,379లుగా, భార్య ఇందిరారెడ్డి పేరిట చరాస్తి విలువ రూ. 7,35, 35, 261లుగా చూపించారు. ఇక స్థిరాస్తి విలువను రూ.24,00,00,000లు, భార్య పేరిట స్థిరాస్తి విలువ రూ. 63,35,000లుగా పేర్కొన్నారు.
- **కోట నీలిమ (కాంగ్రెస్ అభ్యర్థి)**
కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కోట నీలిమ చరాస్తుల విలువను రూ. 18,63,16,724లుగా, భర్త పవన్‌ఖేరా పేరిట రూ. 1,58,21,704లను చరాస్తుల విలువగా పేర్కొన్నారు. స్థిరాస్తుల విలువను ఆమె పేరిట రూ.28,38,77,500లను, భర్త పేరిట రూ.25,00,000 లక్షలుగా చూపించారు. ఇక ఆమెకు వారసత్వంగా వచ్చిన ఆస్తుల విలువ రూ.5,05,56,000లు, భర్తకు వారసత్వంగా వచ్చిన ఆస్తుల విలువను రూ. 85,00,000లుగా పేర్కొన్నారు.
- **సికింద్రాబాద్‌లో 16 నామినేషన్లు...**

చిలకలగూడ : సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను గురువారం రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్లారెడ్డికి అందించారు. ఆయన కోడలు మేకల కీర్తిహర్షకిరణ్ బీజేపీ తరుపున మరో నామినేషన్ దఖలు చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తీగుళ్ల పద్మారావుగౌడ్, ఆదం సంతోష్‌కుమార్‌లు మరో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించారు. బలిరాజా పార్టీ నుంచి దునుకు నాగేశ్వరరావు, ధర్మసమాజ్‌పార్టీ నుంచి గోల్కొండ కృష్ణ, ఇండిపెండెంట్లుగా బాలంరాయ్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన పీ. భవానీ, పార్శిగుట్ట సంజీవపురంకు చెందిన ముదుగుల సునీతలు నామినేషన్ వేశారు. ఈనెల 10వ తేది శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో మరిన్ని నామినేషన్లు దఖలయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు.

కంటోన్మెంట్‌లో 13కు చేరిన నామినేషన్లు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో గురువారం నాలుగు నామినేషన్‌లు దాఖలయ్యాయి. వీటిలో మూడు అదనపు సెట్‌లు కాగా, ఒక్కరు మాత్రమే కొత్తగా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరపున జీవీ వెన్నెల, బీఆర్‌ఎస్ తరపున జి. లాస్య నందిత ఇదివరకే రెండు సెట్‌ల చొప్పున నామినేషన్లు వేయగా, గురువారం మరో సెట్ నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థి బి. కిరణ్ కుమార్ సైతం మరోసెట్ నామినేషన్ వేశారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పర్వం ముగిసేందుకు ఒక్కరోజే సమయం ఉన్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ ఇప్పటికీ తమ అభ్యర్థిని ప్రకటించపోగా, ఆ పార్టీ తరపున ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయడం గమనార్హం. మొత్తంగా ఏడుగురు అభ్యర్థులు, 13 నామినేషన్‌లు దాఖలు అయ్యాయి.



అట్టహాసంగా తలసాని నామినేషన్

- వేలాదిగా వచ్చిన జనం
- అడుగడుగునా స్వాగత వేదికలు


ర్యాలీగా వెళుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ ర్యాలీ గురువారం అట్టహాసంగా కొనసాగింది. వందలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంఘాల ప్రతినిధుల మధ్య ఈ ర్యాలీ కొనసాగింది. బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం ప్రారంభమైన ర్యాలీ బైబిల్ హౌస్, సిటీలైట్ హోటల్, కింగ్స్ వే, బాటా, ప్యాట్నీ సెంటర్, హరిహరకళాభవన్ గుండా జీహెచ్‌ఎంసీ కార్యాలయం వరకు సాగింది. భారీ వాహనంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కింగ్స్‌వే, బాటా, ఆర్‌పీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పలు సంఘాలు, అసోసియేషన్ ప్రతినిధులు స్వాగత వేదికలను ఏర్పాటు చేసి అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. క్రేన్ సహాయంతో అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయనకు భారీ గజమాల వేశారు. గంటల తరబడి సాగిన ర్యాలీ కారణంగా ఆర్పీ రోడ్డులో ట్రాఫిక్‌కు కొంత ఇబ్బంది కలిగింది.

జంగ్ 2023 తెలంగాణ

జెండా మోసిన వారికే పార్టీలో గుర్తింపు

- సామాన్యులు స్వేచ్ఛగా బతికేలా చేసింది కాంగ్రెస్
- ప్రభుత్వ భూములు అమ్ముకున్న ఘనత బీఆర్‌ఎస్‌ది
- కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి


సీతాఫల్‌మండి బహిరంగసభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. చిత్రంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్

చిలకలగూడ : కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందని, ప్రభుత్వ భూములు అమ్ముకున్న ఘనత బీఆర్‌ఎస్ పార్టీదేనని, జెండా మోసిన వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండి అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని హస్తం గుర్తుకు ఓటేసి సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేఓవర్లు, ఐటీ కంపెనీలు, మెట్రోరైల్, రాజీవ్ స్వగృహ ఇళ్లు, ఔటర్ రింగ్‌రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యత నెలకొల్పి శాంతియుత వాతావరణంలో సామాన్యులు స్వేచ్ఛగా బతికే అవకాశం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సికింద్రాబాద్, ముషీరాబాద్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి ఆదం సంతోష్‌కుమార్, అంజన్ కుమార్, ఫిరోజ్‌ఖాన్, ప్రజాయుద్ధనౌక గద్దరన్న కుమార్తె వెన్నెలకు కంటోన్మెంట్ టికెట్లు ఇచ్చామన్నారు. టిక్కెట్లు అమ్ముకున్నారని హరీష్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.కోకాపేట, ఔటర్‌రింగ్ రోడ్డు భూములు అమ్ముకున్నది బీఆర్‌ఎస్ పార్టీయేనని దుయ్యబట్టారు. అలుగడ్డలు అమ్ముకున్న వ్యక్తి ప్రభుత్వ భూములు కబ్జాచేసి అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆదం కుటుంబం గత మూడు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతున్నారని, ఆదం ఉమాదేవి రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా సేవలు అందించారని, హస్తం గుర్తుకు ఓటేసి ఆదం సంతోష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించాలని కోరారు.

సీఎం రేవంతన్న...

సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి రేవంత్‌రెడ్డి చేరుకోగానే కాబోయే సీఎం రేవంతన్న అంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దపెట్టున నినాదాలు చేయడంతో రేవంత్‌రెడ్డి ముసిముసిగా నవ్వుకున్నారు. టీపీసీపీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాకతో సికింద్రాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, నాయకులు కృష్ణకుమార్‌గౌడ్, అనీల్, జయ్‌రాజ్, కొండల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం


వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న డా. శంకర్ నాయక్

లాలాపేట: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో గిరిజన సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమాచార శాఖ రాష్ట్ర మాజీ కమిషనర్ డా. గుగులోతు శంకర్ నాయక్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జీఎస్ఎస్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్, కల్యాణ లక్ష్మీ, తాగు నీరు, సాగు నీరు వంటి పథకాలతో రూపొందిన వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా తండాలో మా రాజ్యం పేరుతో 3146 గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంత్ సేవాలాల్, కొమురం భీమ్‌ల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు బంజారా భవన్ నిర్మాణం చేపట్టారని కొనియాడారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలనీ కోరారు. ముచ్చటగా మూడవ సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజునాయక్, చంటి, మురళీ జాదవ్,సురేష్ నాయక్, తేజా నాయక్, శివనాయక్, నవీన్ నాయక్, మోహన్ తదితరులున్నారు.

ఎన్‌ఎస్‌యూఐ సెక్రటరీగా రేవంత్


రేవంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గం మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన లా విద్యార్థి ఎస్. రేవంత్‌కుమార్ ఎన్ఎస్‌యూఐ హైదరాబాద్ జిల్లా సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, సిటీ ప్రసిడెంట్ అభిజిత్‌యాదవ్ రేవంత్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన ఎన్ఎస్‌యుఐ అధినాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సికింద్రాబాద్ నియోజక వర్గం ఎన్ఎస్‌యూఐ నేతలు, కార్యకర్తలు రేవంత్‌ను శాలువాతో సన్మానించారు.

ధూంధాంగా కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జీవి వెన్నెల

రసూల్‌పురా: ప్రజా గాయకుల ధూంధాం కార్యక్రమాలతో, ఒగ్గు కళాకారులు, డప్పు వాయిద్యాలు తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే విధంగా బోనాలు, కోలాటం , ఆదివాసి కళాకారులతో, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బోర్డు కార్యాలయానికి చేరుకుని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జీవి. వెన్నెల గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు అల్వాల్ భూదేవి నగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరిన ఆమె సమీపంలోని పోచమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మడ్‌ఫోర్ట్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా మడ్‌ఫోర్ట్ చౌరస్తా, జేబీఎస్, వైఎంసీఏ ద్వారా బోర్డు కార్యాలయానికి చేరుకున్నారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీ మర్రి అమరేందర్ రెడ్డి, గద్దర్ స్నేహితుడు జేబీ. బాబు లతో కలిసి ఆర్‌వో మధుకర్‌నాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. గద్దర్ బిడ్డ కోసం వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారని వెన్నెల అన్నారు. అందరి అభిమానంతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని తెలిపారు.

మళ్లీ ప్రేమించాలని వేధిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

వెంగళరావునగర్: ఒకసారి ప్రేమించి విడిపోయిన యువకుడు మళ్లీ ప్రేమించాలని యువతిని వేధిస్తున్న సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రహమత్‌నగర్‌కు చెందిన యువతికి (20)కి 2018లో చందూలాల్ అనే వ్యక్తి ప్రేమించుని కొంతకాలం తర్వాత విడిపోయారు. 2021లో మళ్లీ ప్రేమలో పడి కొంతకాలం తర్వాత విడిపోయారు. ఇటీవల చందూలాల్ తిరిగి ప్రేమించాలని వేధిస్తున్నాడు. దాంతో విసుగుచెందిన యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శారీరకంగా కలవాలంటూ బెదిరింపు

గతంలో పరిచయం ఉన్న వ్యక్తి తనను కలవకపోతే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నట్లు యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉండే యువతికి 9 నెలల కిందట రమేష్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. కొన్ని రోజుల తర్వాత వరంగల్‌లో ఇరువురూ కలుసుకున్నారు. ఆమె వ్యక్తిగత ఫొటోలు యువకుడు తీసుకున్నాడు. ఇటీవల ఆ యువకుడు తనను శారకంగా కలవాలని, లేకపోతే గతంలో తీసిన ఫొటోలు సోషల్ మీడియలో పెడతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



అడ్డగుట్ట: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. హైద్రాబాద్ ఎండ్ సైడ్‌లో సుమారు 40–45 మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి గురువారం మధ్యాహ్నం పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు.

ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదం దారుణం

- పోరాట కమిటీ నాయకులపై కేసులను ఎత్తివేయాలి
- తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదాన్ని మోపడం సరైంది కాదని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామం దగ్గర జూరాల ఆర్గానిక్ ఫార్మ్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా ఈ కంపెనీ ఏర్పాటు చేయడం సరైంది కాదని ఈ కంపెనీ ఉత్పత్తి జరిగితే దాని ప్రభావం చుట్టు పక్కల ఉన్న 54 గ్రామాలపై పడుతుందన్నారు. గాలి, నీరు, భూగర్భ జల కాలుష్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది కాలుష్యపు కోరల్లోకి వెళ్తుందని పర్యావరణ వేత్తలు కూడా చెబుతున్నారని అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిని చిత్రహింసలకు గురి చేసి జైలులో నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోరాట కమిటీ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... కంపెనీ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో పని చేసే కూలీలు ఊపిరాడక స్పృహతప్పి పడిపోతున్నారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలపై పెట్టిన కేసులను బేషరుత్తుగా ఎత్తివేసి ఆ కంపెనీని మూసి వేయాలని డిమాండ్‌చేశారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, సైంటిస్టు బాబురావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, వివిధ సంఘాల నాయకులు కన్నెగంటి రవి, సారంపల్లి మల్లారెడ్డి, సాదినేని వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, సంజీవ్, చంద్రశేఖర్, పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చక్రవర్తి ప్రసంగించారు.

కోలాహలంగా లాస్య నామినేషన్


తండ్రి సాయన్న చిత్రపటానికి నమస్కరిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత నామినేషన్ ర్యాలీ కోలాహలంగా సాగింది. గురువారం ఉదయం కార్ఖానాలోని దివంగత ఎమ్మెల్యే సాయన్న నివాసానికి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. వందలాది మంది కార్యకర్తలు వెంటరాగా లాస్య నందిత కార్ఖానా, పికెట్, జేబీఎస్ మీదుగా కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్‌కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె కంటోన్మెంట్ ఎన్నికల బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. లాస్యనందిత భారీ మెజార్టీతో గెలిచి రావాలని మంత్రి తలసాని ఆకాంక్షించారు. నామినేషన్ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల బీఆర్‌ఎస్ ఇంచార్జ్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథం, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హారిక ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని మెట్రీ బ్రిడ్జి కింద సుమారు 60–65 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు అతడిని పరీక్షించి మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి


హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో గురువారం ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో క్రాస్ ఫ్యామిలీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ప్రొఫెసర్ డి. శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ మెనేజ్‌మెంట్, రక్తదానం ఆవశ్యకతను విద్యార్థులకు తెలిజేసేందుకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారి జీవితాలను రక్షించేందుకు రక్తదానం ఎంతో దోహపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఆరోగ్య పరిరక్షణపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగాఉచిత కన్సల్టేషన్‌తో పాటు గైనకాలనీ, పల్మనాలజీ, డెంటల్ తదితర వైద్య సేవలతో పాటు బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్ రెడ్డి, అధ్యాపకులు వెంకటయ్య, గంగాధర్, చెన్నప్ప, సుమలత, విద్యాసాగర్, అప్పారావు, ప్యాట్రిక్, విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాట యోధుడు చంద్ర పుల్లారెడ్డి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ అరుట్ల జానకిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాణ యోధుడు చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ అరుట్ల జానికిరెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చంద్రపుల్లారెడ్డి చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించినప్పుడే చంద్ర పుల్లారెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీసీపీ లసీ అధ్యక్షుడు ముప్పాల సుబ్బారావు, సీపీఐఎంఎల్ రామచంద్రన్, రాష్ట్ర నాయకులు ఎల్లుట్ల మల్లేష్, పీవైఎల్ కన్వీనర్ భానుప్రసాద్, దుర్గం సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ కృష్ణ ప్రసాద్



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ అధికారి టి. కృష్ణ ప్రసాద్ పేరును పార్టీ ఖరారు చేసింది. కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా గురువారం ఉదయం నుంచి శ్రీగణేష్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పేర్లు వినిపించినప్పటికీ రాత్రి మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్‌ను అభ్యర్థిగా ఖరారు చేస్తూ పార్టీ అధినాయకత్వం బీఫాం అందజేసింది. 1987 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన టి. కృష్ణప్రసాద్ 2020లో డీజీపీ ర్యాంకుతో పదవీ విరమణ చేశారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం సామాజిక సేవా సంస్థను కొనసాగిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత బీజేపీలో చేరిన ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పదవిలో కొనసాగిన కాలంలో గ్రామీణ విద్య. ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, బాలిక విద్య. ఇతర అంశాల్లో విశేషంగా కృషి చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ – జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ల మధ్య ఈ నెల 8న సుమారు 25 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు.

మరో ఘటనలో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని కాజీపేట్ ఎండ్‌లోని వాషింగ్ ఏరియాలో గురువారం రాత్రి సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్, లైట్ బ్లూ కలర్ జీన్స్ ధరించాడని, చేతి పై 'వీణా' అని హిందీలో పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు.

పద్మారావునగర్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో గురువారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు పద్మారావునగర్, బల్‌రామ్ కంపౌండ్, బ్రూక్ బాండ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో ఓటుతో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి పురూరవరెడ్డి, నాయకులు హరినాథ్ నాయి, వై. సురేష్ కుమార్, శివరామక్రిష్ణ, ఉమేష్ ఖండెల్వాల్, గుంటి సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, శ్రీకాంత్, అండాలు, శ్రీకర్, రవి, దేశపాండే తదితరులు పాల్గొన్నారు.